15062025-DIS-16_Layout 1 6/15/2025 2:37 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

న్యాయాన్ని పాతిపెట్టే అన్యాయ పాలన!

కొణతం దిలీప్
98496 96536

మూడు అరెస్టులు.. ఆరు కేసులన్నట్టుగా రేవంత్ ప్రభుత్వం రాష్ట్రంలో పాలన సాగిస్తున్నది. నయానో భయానో తన దారికి తెచ్చుకోవాలని తలపోస్తున్నది. తన మాటకు ఎదురు చెప్పేవారి పట్ల కర్కశంగా వ్యవహరిస్తున్నది. ప్రజాకంటక విధానాలను యథేచ్ఛగా అమలుచేస్తున్నది. ప్రశ్నిస్తున్న వాళ్లను కంట్లో పెట్టుకుంటున్నది. 'అంతు చూస్తా' అన్నట్టుగా బెదిరింపులకు గురిచేస్తున్నది. తనకెవరూ ఎదురుచెప్పకూడదని, ఒకవేళ చెప్తే 'పరిణామాలు తీవ్రంగా ఉంటాయి' అని తన చర్యల ద్వారా బాహాటంగానే హెచ్చరిస్తున్నది. ప్రజాస్వామ్య పరిరక్షణ 'మా ఏడో హామీ' అని ఊదరగొట్టి తెలంగాణలో ప్రజాస్వామ్యస్ఫూర్తినే కాలరాస్తున్నది. అందుకు గత ఏడాది కాలంగా నా పట్ల రేవంత్ సర్కార్ అనుసరిస్తున్న వైఖరే ప్రత్యక్ష నిదర్శనం.

ఈ జూన్ 11వ తేదీన రాత్రి 9 గంటలకు నిర్మల్ జిల్లా న్యాయస్థానం ప్రాంగణం సాక్షిగా రేవంత్ సర్కార్ న్యాయాన్ని పాతిపెట్టే ప్రయత్నం చేస్తున్నదని లోకానికి మరోసారి తేలిపోయింది. చివరికి న్యాయమూర్తి జోక్యం చేసుకొని, నన్ను వదిలివేయాలని ఆదేశిస్తే కానీ, పోలీసులు వదల లేదు. గత 13 నెలలుగా అక్రమ కేసులు పెట్టి నన్ను జైల్లో పెట్టాలని ప్రయత్నించటం, న్యాయస్థానాల జోక్యంతో నాకు స్వేచ్ఛ లభించడం తెలంగాణ ప్రజలు చూస్తూనే ఉన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సహా అనేక మంది నాయకులను, సోషల్ మీడియా యాక్టివిస్టులను రకరకాల విచారణలు, కేసుల పేరుతో వేధించటాన్ని అందరూ గమనిస్తున్నారు. పాలనలో విఫలమై, ఇచ్చిన 420 హామీలను అమలు చేయలేక రాష్ట్రాన్ని అధోగతి పాలుజేస్తున్న రేవంత్ ప్రభుత్వం ప్రశ్నిస్తున్న వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నది.

అక్రమ కేసులు బనాయించి, అరెస్టులు చేసి, జైళ్లకు పంపి ప్రతిపక్షం అనేదే లేకుండా చేయాలని కాంగ్రెస్ సర్కార్ కుట్ర చేస్తున్నది. హైడ్రా బాధితులు, మూసీ కూల్చివేతల బాధితులు, లగచర్ల బాధితులు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల పోరాటం ఇలా ఏ ప్రజా పోరాటానికి మద్దతుగా నిలబడినా, సోషల్ మీడియాలో పోస్ట్ చేసినా కేసులతో రేవంత్ ప్రభుత్వం వేధిస్తున్నది.

2024, మే నెలలో తెలంగాణ స్టేట్ ఆర్టీసీ (టీఎస్ఆర్టీసీ) పేరును తెలంగాణ ఆర్టీసీ (టీజీఆర్టీసీ)గా మార్చినప్పుడు 'తెలంగాణ అస్తిత్వాన్ని ఎందుకు చెరిపేసే ప్రయత్నం చేస్తున్నారు?' అని ప్రశ్నించినందుకు నా మీద తొలి కేసు నమోదైంది. చివరికి హైకోర్టు జోక్యం చేసుకొని నన్ను అరెస్టు చేయొద్దని చెప్పింది. 2024, సెప్టెంబర్‌లో పోలీసు బృందం ఏ కారణమూ చెప్పకుండానే నన్ను నిర్బంధించింది.

హైదరాబాద్‌లోని పలు పోలీస్‌స్టేషన్లు తిప్పి 12 గంటల పాటు వేధించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతలు ఖండించారు, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తోపాటు అనేక మంది కార్యకర్తలు పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. పరిస్థితులను బేరీజు వేసుకున్న పోలీసులు అర్ధరాత్రి నోటీస్ ఇచ్చి విడుదల చేశారు. ఆ నోటీస్ చూశాకే ఆదిలాబాద్ జిల్లాలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించిన కేసు ఒకటి నా మీద అక్రమంగా బనాయించారని అర్థమైంది. అక్టోబర్‌లో వ్యక్తిగత పని నిమిత్తం ఫ్రాన్స్ దేశానికి వెళ్లి స్వదేశానికి తిరిగి వచ్చేప్పుడు ఎయిర్‌పోర్టులో అరెస్ట్ చేసేందుకు మరొక అక్రమ కేసు బనాయించి 'లుక్ ఔట్ సర్క్యులర్' జారీ చేసింది. ఆ లుక్ ఔట్ సర్క్యులర్‌ను సస్పెండ్ చేసి, నన్ను స్వదేశానికి రానివ్వవలసిందిగా రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ వేస్తే

హైకోర్టు న్యాయస్థానం ఆ లుక్ ఔట్ సర్క్యులర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు ఉత్తర్వులను పోలీసులకు ఇవ్వడానికి సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే ఇంకో కొత్త కేసు పెట్టి మరోసారి అరెస్ట్ చేశారు.

నిజానికి చట్టబద్ధ పాలన మీద నమ్మకం ఉన్న ఏ ప్రభుత్వం కూడా ఇట్లా హైకోర్టు ఉత్తర్వులు అందజేయడానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన పౌరుడిని అరెస్ట్ చేయదు. కానీ, రేవంత్ పాలనలో చట్టవ్యతిరేక పనులు నిరాఘాటంగా కొనసాగుతూనే ఉన్నాయి.

అప్పుడు కూడా నా అరెస్ట్‌ను గోప్యంగా ఉంచి, అనేక పోలీస్‌స్టేషన్లు తిప్పి నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. వేరెవరి మీదనో పెట్టిన ఈ అక్రమ కేసు విషయం 'ఇక ముందు ఏ చర్యలూ తీసుకోవద్దు' అని అంతకు కొన్ని వారాల కిందటనే రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చిన పాత ఎఫ్ఐఆర్‌కు నా పేరును జతచేశారు. 'ఏ చర్యలూ తీసుకోవద్దు' అని ఉత్తర్వులున్నా, అదే ఎఫ్ఐఆర్‌కు మరో పేరెలా జతచేస్తారు? అని న్యాయస్థానం ప్రశ్నించి, పోలీసులు కేసు మోపటంలో ఉద్దేశాన్ని గమనించి నన్ను విడుదల చేసింది. నా మీద ఇప్పటివరకూ రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల్లో నమోదైన కేసుల వివరాలు తెలపాలని వెంటనే రాష్ట్ర డీజీపీ, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ఎస్పీలకు లేఖలు రాశాను. వాటికి జవాబు రాలేదు. కానీ, ప్రతిరోజూ నన్ను అరెస్ట్ చేయడానికి పోలీస్ బృందాలు తిరుగుతూనే ఉన్నాయని గమనించి న్యాయవాదులు నా మీద ఉన్న కేసుల వివరాలన్నీ తెలుపాల్సిందిగా రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ వేశారు. నాకు తెలియకుండా, కనీసం సమాచారం ఇవ్వకుండా నా మీద ఐదు కేసులు న్నాయని ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. అంతేకాదు, ఆ కేసుల్లో నన్ను అరెస్ట్ చేయకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీచేస్తే మరోసారి తాత్కాలికంగా రేవంత్ సర్కార్ వెనక్కి తగ్గింది.

మే 18వ తేదీన మా నాన్నగారి స్మారకార్థం మా కుటుంబ సభ్యులం తెచ్చిన పుస్తకాన్ని అమెరికాలోని వర్జీనియాలో ఆవిష్కరించేందుకు మా చెల్లె విశాలి ఒక కార్యక్రమాన్ని ఏర్పాటుచేసింది. అందులో నేను హాజరుకావొద్దని, నన్ను అమెరికా వెళ్లకుండా నిరోధించేందుకు మరొక లుక్‌అవుట్ సర్క్యులర్‌ను రేవంత్ సర్కార్ జారీచేసింది. నా అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వాలని డీజీపీకి సహా ఉన్నతాధికారులకు లేఖ రాసినా ఫలితం లేకపోయింది. దీంతో గత్యంతరం లేక నేను హైకోర్టును ఆశ్రయిస్తే నెలరోజుల పాటు అమెరికా వెళ్లడానికి అనుమతి ఇచ్చింది. కానీ, మరోసారి హైకోర్టు ఆదేశాలను రేవంత్ సర్కార్ బేఖాతరు చేసింది.

మొన్న జూన్ 10వ తేదీన అమెరికా నుంచి హైదరాబాద్ విమానాశ్రయంలో దిగగానే పోలీసులు నన్ను అక్రమంగా నిర్బంధించారు. నిర్మల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జూన్ 11 వరకూ ప్రయాణం చేసే అవకాశం హైకోర్టు ఇచ్చినా, ఆ గడువు ముగియకముందే అరెస్ట్ చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పుల పట్ల ఏ మాత్రం గౌరవం లేదని నిరూపిస్తున్నది.

తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ అడుగుజాడల్లో నడిచాం. ఉమ్మడి రాష్ట్రంలోనే ఎలాంటి తప్పుడు కేసులకు, తాటాకు చప్పుళ్లకు బెదర లేదు. మాకు న్యాయవ్యవస్థ మీద పూర్తి నమ్మకం ఉన్నది. తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తూనే ఉంటాం. రాజ్యాంగాన్ని, న్యాయస్థానాలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అపహాస్యం చేస్తున్నది. రేవంత్ ప్రభుత్వ అరాచక పాలన మీద తెలంగాణలోని బుద్ధిజీవులు, ప్రజాస్వామ్యవాదులు గొంతెత్తాలి. జై తెలంగాణ!

(వ్యాసకర్త: రాష్ట్ర డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్)

మట్టిని మట్టుపెడుతున్న మందు

జి.అజయ్ కుమార్

పుడమి గర్భంలోని జీవాన్ని హరిస్తున్నది కలుపు కాదు, కలుపును చంపేందుకు మానవులు చేస్తున్న చర్యలే. దానికి మూలకారణం 'గ్లైఫోసేట్' అనే నాన్-సెలెక్టివ్ హెర్బిసైడ్. ఇది వాడిన భూమిలో జీవమనేదే మిగలదు. ఈ రసాయనం పడిన చోట మట్టి శ్వాస కూడా తీసుకోలేదు. పంటల మీద పడితే మాడిపోతాయి. ఆ మందు వాడిన గడ్డిని తినే మూగజీవాలు సైతం చనిపోతాయి. రైతులు తీవ్ర అనారోగ్యాల బారినపడతారు. భూమిలో జీవానికి, భూమిపై మానవాళికి పెనుముప్పుగా మారిన ఈ గడ్డి మందును చాలా దేశాలు నిషేధించాయి. కానీ, మన దేశంలో మాత్రం యథేచ్ఛగా క్రయవిక్రయాలు జరుగుతుండటం శోచనీయం.

అమెరికాలోని ఒక ప్రముఖ కంపెనీ 1970లో మొదటిసారిగా గ్లైఫోసేట్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఇది మొక్కల్లోని ఒక ముఖ్యమైన ఎంజైమ్‌ను నిరోధించి, మొక్కల ఎదుగుదలను అడ్డగిస్తుంది. దీన్ని ప్రధానంగా కలుపు నివారణ కోసం వాడుతున్నప్పటికీ, ఇది పంటలు, మట్టిలోని ఇతర జీవులపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. కూలీల ఖర్చులను తగ్గించేందుకు రైతులు గ్లైఫోసేట్‌ను విస్తృతంగా వాడుతున్నారు. కలుపును నివారిస్తున్నట్టు అన్నదాతలు భావిస్తున్నారు. కానీ, దీర్ఘకాలంలో భూసారం తగ్గిపోయి దిగుబడి పడిపోతుంది. అంతేకాదు, కర్షకులు కూడా రోగాల బారినపడి అనవసర ఖర్చుల భారం మోయాల్సి వస్తుంది. గ్లైఫోసేట్ పిచికారి మూలంగా నెలకు సగటున 12 మంది రైతులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నట్టు 2023లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఒక అధ్యయనంలో తేలింది. ఎయిమ్స్ నివేదిక ప్రకారం.. గ్లైఫోసేట్ వ్యాప్తి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో గర్భస్థ శిశువుల వృద్ధిలో లోపాలు 18 శాతం వరకు పెరిగాయి.

గ్లైఫోసేట్ వల్ల మట్టిలోని ఫంగై, బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులు నశించి హ్యూమస్ ఉత్పత్తి నిలిచిపోతుంది. ఇది కార్బన్ నిల్వల తగ్గుదలకు దారితీసి, గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాన్ని పెంచుతుంది. తద్వారా వాతావరణ మార్పులకు ఇది పరోక్షంగా కారకమవుతుంది. దీని వాడకం గణనీయంగా పెరగడం వల్ల వాతావరణంపై దుష్ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఐరాస ఐపీపీసీ-2022 నివేదిక స్పష్టం చేసింది.

జర్మనీ, ఆస్ట్రియా, ఫ్రాన్స్, ఇటలీ, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో ఈ రసాయనంపై నిషేధం కొనసాగుతున్నది. 2018లో అమెరికాలోని కాలిఫోర్నియాలో ఈ రసాయనాన్ని ఉత్పత్తి చేస్తున్న కంపెనీపై ఓ రైతు కేసు వేశాడు. దుష్ప్రభావాలు ఉన్నట్టు రుజువు కావడంతో సదరు రైతుకు 289 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాల్సి వచ్చింది. అమెరికాలో ఈ కంపెనీపై ఇప్పటివరకు ఇలాంటి కేసులు లక్షకు పైగా దాఖలయ్యాయి. ఆహార పదార్థాల్లో గ్లైఫోసేట్ అవశేషాలు ఎక్కువవుతున్నాయని కెనడాలో హెచ్చరికలు జారీ అయ్యాయి. 2022 నవంబర్‌లో కేంద్ర ప్రభుత్వం దీనిపై పాక్షిక నిషేధం విధించింది. కానీ, అది నామమాత్రమే. రసాయన కంపెనీల ప్రలోభాలకు లోనై పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు దీని వినియోగాన్ని ప్రోత్సహిస్తుండటం విషాదం. ఏపీ, తెలంగాణల్లో గతంలో 60 రోజులపాటు తాత్కాలికంగా నిషేధించారు. కానీ, ప్రస్తుతం ఇది మార్కెట్లలో విచ్చలవిడిగా లభిస్తున్నది. తమకు అధికారం లేకపోయినా కేరళ, సిక్కిం లాంటి రాష్ట్రాలు రాజకీయ సంకల్పంతో శాశ్వత నిషేధాన్ని అమలు చేస్తున్నాయి. కానీ, ఏపీ, తెలంగాణల్లో మాత్రం ఆ సంకల్పం కొరవడింది.

ఈ రసాయనాన్ని వినియోగిస్తున్న రైతులు ఆర్థికంగా, శారీరకంగా చితికిపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ శాఖ, పరిశోధన సంస్థలు తమ బాధ్యతను మరిచి కార్పొరేట్ కంపెనీల ప్రలోభాలకు తలొగ్గడంతో అన్నదాతల జీవితాలు ఆవిరైపోతున్నాయి.

ఇప్పటికైనా గ్లైఫోసేట్‌పై శాశ్వత నిషేధం విధించాలి. జీవ, సేంద్రియ కలుపు నివారణ పద్ధతులను అభివృద్ధి చేయాలి. రైతులకు అవగాహన కల్పించాలి. రైతు శ్వాస ఆగకూడదంటే, మట్టిలో జీవం కొనసాగాలంటే, భవిష్యత్తు పంటల భద్రత కోసం గ్లైఫోసేట్‌కు శాశ్వతంగా చరమగీతం పాడాలి. ఒక్క రైతే కాదు, మట్టి, ఒక తరం, దేశ భవిష్యత్తే ప్రమాదంలో ఉంది. దీన్ని మౌనంగా చూస్తూ ఉంటే మనం కూడా మట్టి గొంతు పిసికినవాళ్లమవుతాం. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు జీవరక్షణ యజ్ఞాన్ని ప్రారంభించాలి.

(వ్యాసకర్త: వ్యవసాయ నిపుణులు)



ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు అవసరమే. కానీ, పర్యావరణాన్ని నాశనం చేసి, ప్రజల ఆరోగ్యానికి హాని చేసే పరిశ్రమలు మాత్రం కాదు. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ కోసం, ఓజోన్ పొరను కాపాడుకోవడం కోసం దేశదేశాలు గొంతెత్తున్న ప్రస్తుత తరుణంలో అభివృద్ధి మాటున, పారిశ్రామికీకరణ పేరిట ఇథనాల్ లాంటి ఉత్పాతాలను కొని తెచ్చుకోవడం భావ్యం కాదు.

ప్రజలపై లారీల కాఠిన్యం

అవనిశ్రీ

మోదీ నేతృత్వంలో కేంద్రప్రభుత్వం 2021లో ఇథనాల్ పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీలో భాగంగా తెలంగాణలోనూ 30కి పైగా పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. దేశవ్యాప్తంగా భవిష్యత్తులో ఇంధన అవసరాల నిమిత్తం ఈ పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్రం చెప్తున్నది. కానీ, పెట్రోల్‌లో 20 శాతం దాకా ఇథనాల్ కలపడం లాంటి కార్పొరేట్ కంపెనీల లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని ఈ పరిశ్రమలకు కేంద్రం పచ్చజెండా ఊపిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ రసాయనం మూలంగా గాలి, నీరు కలుషితమై, తద్వారా వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు పెను నష్టం వాటిల్లుతుందనే వాస్తవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తుండటం శోచనీయం.

ఒక లీటర్ ఇథనాల్ తయారీకి నాలుగు లీటర్ల నీళ్లు అవసరమని నిపుణులు చెప్తున్నారు. ఏడాదికి సుమారు రెండు లక్షల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యంతో పరిశ్రమను నెలకొల్పేందుకు కేంద్రం అనుమతులిచ్చింది. ఈ లెక్కన ఒక్కో పరిశ్రమకు ఇథనాల్ ఉత్పత్తి అవసరాలకే ఎనిమిది లక్షల లీటర్ల నీళ్లు అవసరం. దీని వల్ల ఆ చుట్టూ గ్రామాల్లో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడుతుంది.

రాజోలి మండలం పెద్ద ధన్వాడ దగ్గర ఇథనాల్ ఫ్యాక్టరీ స్థాపించాలని ప్రభుత్వం గతేడాది ఉత్తర్వులు జారీచేసింది. నడిగడ్డలో చాన్నాళ్ల నుంచి దీనిపై ఉద్యమం నడుస్తున్నది. అయితే, ఈ ఉద్యమానికి నాయకులెవ్వరూ లేరు. అక్కడి పది గ్రామాల ప్రజలే సంఘటితమై బలోపేతమైన ఉద్యమం ఇది.

ఈ ఫ్యాక్టరీ నుంచి వెలువడే విష వాయువుల కారణంగా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. కన్ను, ముక్కు, గొంతు, చర్మ సమస్యలతోపాటు తలనొప్పి, వికారం, వాంతులు వంటి ఇబ్బందులు వస్తాయి. పలు రకాల క్యాన్సర్లు కూడా సోకే ప్రమాదముంది. ఈ ప్లాంట్ నుంచి వెలువడే కాలుష్యం గర్భస్థ శిశువులపైనా ప్రభావం చూపుతుంది. ఆ ప్రాంతంలోని పిల్లలు బలహీనంగా, తక్కువ బరువుతో పుడతారు. ఈ మేరకు ఇప్పటికే అనేక నివేదికలు స్పష్టం చేశాయి.

ఈ పరిశ్రమల వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడాన్ని ప్రభుత్వాలు తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తున్నాయి. ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా జనావాసాలు, పచ్చని పొలాల మధ్య ఇథనాల్, ఫార్మా లాంటి కాలుష్యకారక పరిశ్రమలు నెలకొల్పడం భావ్యం కాదు. ప్రజాభిప్రాయ సేకరణను విస్మరిస్తూ, ప్రజల హక్కులను కాలరాస్తూ పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడం ప్రజాస్వామ్యం అనిపించుకోదు. పాలకులు చేస్తున్న ఈ అన్యాయం గురించి, ఫ్యాక్టరీ వల్ల జరిగే అనర్థాల గురించి కొందరు మేధావులు, యువత, చైతన్యవంతులు ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు.

రచ్చబండల వద్ద సమావేశాలు ఏర్పాటు చేసి, ప్రజా సంఘాలు, నాయకుల మద్దతు కూడగట్టి ప్రజలను సంఘటితం చేశారు. పరిశ్రమలు నెలకొల్పవద్దని సంబంధిత అధికారులను కలిసి విన్నవించుకున్నా ఫలితం లేకుండాపోయింది. అందుకే, గత కొద్దిరోజులుగా ఉద్యమం ఉధృతమైంది. కంటైనర్లు, వాహనాలను ధ్వంసం చేసి సామాన్య రైతులు అసామాన్యమైన పోరాటం చేసి తెలంగాణ మట్టికున్న ఉద్యమ స్ఫూర్తిని చాటారు. అయితే, ఈ ఉద్యమాన్ని అణచివేయాలని ప్రభుత్వం చూడటం హేయం. ప్రజలపై పోలీసులు దాడులు చేయడం, అమాయకులపై కేసులు బనాయించడం సరికాదు. ఓ ప్రభుత్వ ఉద్యోగి మీద, ఒక జర్నలిస్టు మీద కూడా కేసులు పెట్టారు.

ప్రజాస్వామ్య హక్కులు అమలయ్యేలా చూడటమే తమ ఏడో గ్యారెంటీ అని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన మాటకు ఇప్పటికైనా కట్టుబడాలి. పెద్ద ధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలి. ప్రజలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి. పోలీసులు అరెస్టు చేసిన 12 మందిని బేషరతుగా విడుదల చేయాలి. భయం గుప్పిట్లో ఉన్న రాజోలి మండలంలోని గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలి. పరిశ్రమ అనుమతులను వెంటనే రద్దుచేసి తుంగభద్ర పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ భూములను కాపాడాలని మనవి.

(వ్యాసకర్త: నడిగడ్డ సాహిత్య వేదిక అధ్యక్షుడు)

సామాన్యుడి మాట

తన హోటల్లో చాయ్ జేస్తున్న జెల్ల పోశమల్లన్న దంపతులు

మీరిచ్చే పైసలు మిత్తికే సాలయి

'ఓ అయ్యా... జర నీ దయ. మోస్కచ్చేటందుకు నీళ్లేనా? బరువున్న బకీట్లు అమాంతం మోస్కరావద్దని నీకెన్నిమాట్లు చెప్పాలె? నేన్ చెప్తనే ఉంటా, నువ్వు చేసేది చేస్తనే ఉంటవ్..' అని గద్మాయిస్తున్నది గంగవ్వ. పొద్దటిసంది మలెవడి ఉన్న చాయ్ గిలాసలు కడుగాల్నంటే నీళ్లు కావాలె గదా? గిలాసలు కడుగుదామని బోరింగ్ కాడికి వోయి నీళ్ల బకీట్లు మోసుకొస్తున్న. అది జూసిన గంగవ్వ గరం గరమై గాయి కెత్తుకుంటున్నది. గంగవ్వ ఉత్తగనే మొత్తుకుంటలేదు, మిషిన్ ఎక్కడ ఆగిపోతదోనని ఆమె బాధ. ఈ మిషిన్ ముచ్చట తర్వాత జెప్త గనీ గంగవ్వ ఎవ్వలో ఎర్కేనా? నేను తాళి గట్టిన ఆలి. జైతాల జిల్లా గొల్ల పల్లి మండలం తిర్మలాపూర్ చౌరస్తా మూల మీన ఉంటది మా చాయ్ ఓటల్. మాదిదే ఊరు. ఇద్దరాలుమొగలం గల్సి చాయ్ ఓటల్ వెట్టుకొని తలో సార్థం జేస్కుంటున్నం. అల్కటి పనులు నేన్జేస్తే, గొట్టు పనులు నా గంగవ్వ జేస్తది.

***

మేమిద్దరం, మాకు ముగ్గురు. మాకున్నది ఎకురం భూమి. ఆ భూమిల ఏమంత పండుతయ్? అందుకే ఆ భూమిని గంగవ్వను జూస్కొమ్మని చెప్పి నేను ఖతార్ తొవ్వ వట్టిన. 1992ల అనుకుంట జైతాలల పట్నం బస్సు, పట్నంల గాలిమోటరెక్కి, దూరదేశంల దిగిన. ఒక్కేడా, రెండేండ్లా? ఇరువై ఐదేండ్లు అక్కన్నే పన్జేసిన. మొదట్ల లేబర్ పనికే వోయిన గనీ, కొన్నొద్దుల తర్వాత డ్రైవర్ పని దొరికింది. ఆ తర్వాత కొన్నొద్దులకు క్రేన్ నడిపే పనికి కుదిరిన. ఓ రోజు పనైపోయి ఇంటికివోయినంక నాత్రి ఎడమ జబ్బ గుంజుకొస్తున్నది. ఉత్త నొప్పే గావొచ్చునని ఎక్స పట్టిచ్కోలె. తెల్లారి దూటికి ఎప్పట్లెక్కనే వోయిన. దూటొక్కి డ్రైవర్ సీటు మీన గూసున్న. గంతే.. కండ్లకు శిమ్మ శీకట్లచ్చి కూసున్న కుర్సీలనే కూలవడ్డ. 'అరేయ్ పోశమల్లన్నకు ఏమో అయిందిరా.. పట్టుర్రి దావఖానకేస్కవోదాం' అని అమాంతం లేవట్టిర్రు. వాళ్ల మాటలు నాకినవడ్డున్నయి గనీ, నిల్సొని మాట్లాడే ఓసర లేదు.

కండ్లు దెర్సి జూస్తే... తెల్లారి ఖతార్‌లోని ఓ దావఖాన్ల నేను షరీఖై ఉన్న. 'నాకేమైంద'ని మా ఊరి దోస్తులనడిగితే వాళ్లు శెప్పవట్టిర్రు నాకు ఆటోటాక్ అచ్చిందని. స్టంట్లు గూడ ఏసిర్రట. 'ఇది మొదటి సారే, ఏం గాదు గనీ, కొంచెం జాగ్గర్తగుండాల'ని డాక్టర్లు శెప్పవట్టిర్రు. అక్కడ జరిగిన ముచ్చట తిర్మలాపూర్‌ల ఉన్న గంగవ్వకెట్ల ఎర్కయిందో ఏమో గని.. జుమ్మ రోజు ఇంటికి పోన్జేస్తే ఒక్కటే మొకాన ఏడ్వవట్టింది. 'అర్రె నాకేం గాలెదే.. శెక్కర్రొచ్చి కిందవడ్డ గంతే' అన్జెప్పినా నమ్మలే. 'మాకు మొత్తం ఎర్కే గని, నువ్వైతే ముందుగాళ్ల ఇంటికిరా' అని బతిలాడవట్టింది. ఆమె ఒక్కతే గాదు, బిడ్డ, ఇద్దరు కొడుకులు గూడ అదే మంకుపట్టు వట్టిర్రు. వాళ్ల మాట తీసెయ్యలేక ఇండియాకొచ్చిన. ఎయిర్పోర్టుల ఇమానం దిగి ఇట్ల బైటికచ్చిన్నో లేదో.. మాచోళ్లు నా మీదవడి ఒగేడ్సుడు గాదు. వాళ్లేడ్పు జూసి నా కండ్లు గూడ ధైర్నం శెడ్డయి.

అసలే గొల్లోళ్లం. ఉంటే గింటే గొర్లమందలుంటయి గని, అయ్యవ్వలు, తాతముత్తాతలు సంపాయించిన ఆస్తిపాస్తులుంటయా? కమ్సెకం మాకా గొర్లు గూడ లెవ్వు. ఎకురం భూమిల ఎంత పండించినా ఎన్కకే గని, ముందుకు వోవుడుంటదా? గందుకే ఓ ఇకమత్ జేసి మా తిర్మలాపూర్ చౌరస్తా మూలమీన చాయ్ ఓటల్ వెట్టినం. పొద్దటిపూట తడట్కులు, ఇడ్లి, వడ, పూరి.. మాపటి పూట చాయ్ అమ్ముకుంటా బతుకు ఎల్లదీస్తున్నం. 2018ల అనుకుంటా... ఓ రోజు మబ్బుల్నే నేను, గంగవ్వ ఇద్దరం గల్సి ఓటల్ కాడికొచ్చినం. నేను టిఫిన్లు జేస్తున్న. గంగవ్వనేమో అన్నకు సామాన్లు అందిస్తున్నది. ఆ ఆటోటాక్ పాడుగాను మల్లొచ్చి పాడైంది. ఎడమదిక్కు గుంజుకొస్తున్నదని గంగవ్వకు జెప్పంగనే జెట్టి ఆటో మాట్లాడింది. ఆ ఆటో సీద వోయి కన్నారం అపోలో రీచ్ దావఖాన కాడ ఆగింది. నాకు పరీచ్చలు జేసి మల్లోపారి స్టంట్లెయ్యాల్నని శెప్పవట్టిర్రు. 'పైసలకేడ వోవుడు సార్.. సక్కగ నన్ను సర్కార్ దావఖానకు పంపియ్యిర్రి' అంటే.. 'ఎందుకే పోశమల్లన్న ఇన్లగూడ ఫిరీగనే జేస్తం' అని శెప్పవట్టిర్రు డాక్టర్లు. 'అదేందనడిగితే మీకు తెల్లరేషన్ కార్డుంటే ఐపాయె.. నీకయ్యే దావఖాన కర్సు మొత్తం కేసీఆరే వెట్టుకుంటడని ఇమ్మతిచ్చిర్రు. వాళ్లన్నట్టే నాకు రూపాయి కర్సు గాలె. అంతేగాదు ఏడాది పాటు మందులు గూడ ఉచితంగనే ఇచ్చిర్రు.

*పది రోజుల తర్వాత దావఖాన్లకెళ్లి ఇంటికొచ్చిన. నెలా, రెణ్నెళ్లు గంగవ్వొక్కతే ఓటల్ నడిపింది. కొన్నొద్దులకు నేను ఓటల్‌కు వోక తప్పలేదు. అప్పట్నుంచి ఓ నాలుగైదేండ్ల దాన్క మంచిగనే పన్జేసుకున్న. 2024 జనవరిల అనుకుంట.. కాంగ్రెస్ ప్రభుత్వం అచ్చినంక నాకు మళ్లోపారి ఆటోటాక్ అచ్చింది. అప్పుడు గూడ అపోలో దావఖాన్లకే ఏస్కచ్చిర్రు. ఈ సారి అక్కడి డాక్టర్లు నన్ను శేతవట్టలె. 'కండిషన్ కొంచెం మంచిగలేదు, జల్ది పట్నం పట్కపోవాల'న్నరు. గంగవ్వ, నా ఇద్దరు కొడుకులు అప్పటికప్పుడు అంబులెన్స్ మాట్లాడుకొని పట్నంల ఉన్న ఓ ప్రైవేటు దావఖానకే స్కచ్చిర్రు